# 'నూతన' శోభ

### కోటి ఆశలతో కొంగొత్త సంవత్సరానికి యువతీయువకుల స్వాగతం

### 31న అర్ధరాత్రి వేళ గడిచిన సంవత్సరానికి జిల్లా ప్రజల వీడ్కోలు

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా బుధవారం నూతన శోభ సంతరించుకుంది. 2024 సంవత్సరానికి ఈ నెల 31న అర్ధరాత్రి వేళ జిల్లా ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. అదే సమయంలో కేరింతలు, కేకుల కటింగులతో కొంగొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. ముఖ్యంగా యువతీ యువకులు పెద్ద ఎత్తున సంబురాలు జరుపుకున్నారు. కోటి ఆశలతో నూతన సంవత్సరానికి వెల్‌కం చెప్పారు. మహిళలు, చిన్నారులు తమ ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి 2025కు స్వాగతం చెప్పారు. మంగళవారం అర్ధరాత్రి, బుధవారం ఉదయం వేళల్లో ఒకరినొకరు కలుసుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కొంత మందైతే దేవాలయాలకు వెళ్లి ఇష్ట దైవాలకు పూజలు చేశారు. ఇక పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా కేకులు, బిర్యానీలను యువతీ యువకులు కొనుగోలు చేశారు. వస్త్రదుకాణాలు కూడా కిటకిటలాడాయి. క్రైస్తవులందరూ మంగళవారం అర్ధరాత్రి తమ చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాగా, బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలోనూ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధు, రేగా కాంతారావులను పార్టీ నాయకులు, కార్యకర్తలు కలుసుకున్నారు. బొకేలు అందించి, కేకులు కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేసి స్పెషల్ విషెస్ చెప్పారు. మధిరలో బీఆర్‌ఎస్ నేతలు నిర్వహించిన న్యూ ఇయర్ వేడుకల్లో జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు పాల్గొని కేక్ కట్ చేశారు. శ్రేణులందరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

- నమస్తే నెట్‌వర్క్


జూలూరుపాడు: ఆలయంలో సందడి


అశ్వారావుపేట టౌన్: ఆలయాల్లో భక్తుల సందడి


పాల్వంచ: పూజలు చేస్తున్న వనమా వెంకటేశ్వరరావు


చుంచుపల్లి: తన కార్యాలయ ఆవరణలో మొక్క నాటిన డీఎస్పీ రెహమాన్


అన్నపురెడ్డిపల్లి: ఇంటి ముందు వేసిన ముగ్గు


పాల్వంచ రూరల్ : కేక్ కట్ చేస్తున్న కొత్వాల


చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఫాదర్ సుధాకర్


అశ్వారావుపేట టౌన్ : కేక్ కట్ చేస్తున్న దృశ్యం


టేకులపల్లి: చర్చిలో ప్రార్థన


సారపాక : న్యూఇయర్ వేడుకలు జరుపుకుంటున్న మహిళలు


చర్ల : ముగ్గులు వేస్తున్న చిన్నారి


దుమ్ముగూడెం : రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు


భద్రాచలం : నూతన సంవత్సర వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు


బూర్గంపహాడ్ : వేడుకలు నిర్వహిస్తున్న ప్రెస్‌క్లబ్ బాధ్యులు


రామవరం: ముగ్గు వేస్తున్న యువతి

## కూర్మావతారంలో భద్రాద్రి రామయ్య

### రెండో రోజుకు చేరిన అధ్యయనోత్సవాలు

భద్రాచలం, జనవరి 1: ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా భద్రాచలం సీతారామచంద్ర స్వామి బుధవారం రెండోరోజు భక్తులకు కూర్మావతారంలో దర్శనమిచ్చారు. తొలుత స్వామివారిని మేళతాళాల నడుమ మిథిలా స్టేడియం వద్దకు ఊరేగింపుగా అర్చకులు, ఆలయ ఈవో తీసుకురాగా.. కూర్మావతారంలో ఉన్న స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ అవతారంలో ఉన్న స్వామివారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


కూర్మావతారంలో స్వామివారిని మిథిలా స్టేడియంకు తీసుకువస్తున్న ఆలయ అర్చకులు, ఈవో

**నేడు వరాహావతారం..**

భద్రాచలం సీతారామచంద్రస్వామి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా గురువారం వరాహావతారంలో స్వామివారు దర్శనమివ్వనున్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు పథకాలు అమలు చేయాలి

బూర్గంపహాడ్, జనవరి 1: సంక్షేమ బోర్డు ద్వారానే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సారపాక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన ఇతర నిర్మాణ రంగం కార్మికులు జిల్లాలో 61వేల మంది ఉన్నారని, వారిని ప్రభుత్వ లేబర్ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, పెండింగ్‌లో ఉన్న ఇన్సూరెన్స్ డబ్బులు కార్మికులకు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.


మాట్లాడుతున్న బత్తుల వెంకటేశ్వర్లు

## జూదరుల అరెస్ట్

అన్నపురెడ్డిపల్లి, జనవరి 1: కోడి పందెం జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాలు.. మండలంలోని బూర్గూడెం గ్రామ శివారులో కోడి పందేల స్థావరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.2700, ఒక బైక్, రెండు కత్తులు, నాలుగు కోడి పుంజులను స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేశారు. మరికొందరు జూదరులు పారిపోయారు. ఎస్సై చంద్రశేఖర్ దర్యాప్తు చేస్తున్నారు.

అన్నపురెడ్డిపల్లి, జనవరి 1: పేకాట జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాలు.. మండలంలోని కట్టుగూడెంలోగల పల్లె ప్రకృతి వనంలో పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1500, 52 పేకాట ముక్కలు స్వాధీనపర్చుకున్నారు. కేసును ఎస్సై చంద్రశేఖర్ దర్యాప్తు చేస్తున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

**WANTED**

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.

NT-338992-AII

**EDUCATION**

★రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112

NT-337306

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## లక్ష్యాన్ని మించి బొగ్గు ఉత్పత్తి

ఇల్లెందు రూరల్, జనవరి 1: సింగరేణి ఇల్లెందు ఏరియాకు డిసెంబర్ నెలలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి 3.32 లక్షల టన్నుల లక్ష్యాన్ని మించి 3.91 లక్షల టన్నులు (118 శాతం) సాధించినట్లు జీఎం వి.కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 2.05 లక్షల టన్నుల బొగ్గును రైల్వే మార్గం ద్వారా, 0.41 లక్షల టన్నులను రోడ్డు మార్గం ద్వారా, 1.24 లక్షల టన్నులను ఆర్‌సీహెచ్‌పీ ద్వారా బట్వాడా చేసినట్లు వివరించారు. డిసెంబర్‌లో 54 రేకుల ద్వారా బొగ్గు రవాణా చేసినట్లు తెలిపారు. ఇల్లెందు ఏరియాకు కేటాయించిన వార్షిక బొగ్గు లక్ష్యం 26.43 లక్షల టన్నులకుగాను 33.01 లక్షల టన్నులు (125 శాతం) సాధించి, అన్ని ఏరియాలకంటే ప్రథమ స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి కృషి చేసిన సూపర్‌వైజర్లను, అధికారులను, ఉద్యోగులను అభినందించారు.

## గొంతు కోసిన మాంజా దారం

రామవరం, జనవరి1: చైనా మాంజా దారం.. ఓ యువకుడి గొంతు కోసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. చంద్రుగొండ మండలం గుర్రాయిగూడెం గ్రామస్తుడు ఏరువాక కృష్ణారావు, కొత్తగూడెం బూడిదగడ్డలో నివాసముంటున్నాడు. ఓ ప్రైవేట్ పాల డెయిరీలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. నూతన సంవత్సర ఆరంభం రోజున స్వగ్రామంలో తన తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుని, ద్విచక్ర వాహనంపై కొత్తగూడెం తిరిగొస్తున్నాడు. రామవరం ఏరియా వర్క్‌షాపు ముందున్న చిట్టి రామవరం వెళ్లే రోడ్డు వద్ద ఆయన మెడకు ఒక్కసారిగా చైనా మాంజా దారం చుట్టుకుంది. సుమరు రెండు అంగుళాల మేర గొంతు కోసుకుపోయింది. ఈ సమాచారంతో పోలీసులు వెంటనే వచ్చి ఆయనను ఆసుపత్రిలో చేర్పించారు. ఆ తర్వాత, ఆయనను కుటుంబ సభ్యులు కొత్తగూడెంలోని ప్రైవేటు ఆసుపత్రికి, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


తీవ్రంగా గాయపడిన కృష్ణారావు

# రేగాను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

మణుగూరు, జనవరి 1: బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును మణుగూరు బీఆర్‌ఎస్ కార్యాలయంలో మండల బీఆర్‌ఎస్ నాయకులు కలసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ.. సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ఇప్పటి నుంచే కట్టుదిట్టమైన ప్రణాళికలు తయారుచేసుకుని ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కుర్రి నాగేశ్వరరావు, పోశం నర్సింహారావు, వట్టం రాంబాబు, కుంట లక్ష్మణ్, ముద్దంగుల కృష్ణ, బొలిశెట్టి నవీన్, నూకారపు రమేష్, ముత్యం బాబు, ఆవుల నర్సింహారావు, ఎడవెల్లి వెంకటయ్యలు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం, జనవరి 1: బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావును దుమ్ముగూడెం బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కణితి రాముడు, కో-కన్వీనర్ ఎండీ.జానీపాషా బుధవారం మణుగూరులోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. బీఆర్‌ఎస్ నాయకులు, సొసైటీ డైరెక్టర్ బొల్లి వెంకట్రావు, నాయకులు తునికి కామేష్, దామెర్ల శ్రీనివాసరావు, కొత్తా మల్లేశ్వరరావు, బాణోతు నగేష్, కుమ్మరికుంట సూర్య, ఈర్ల ఏడుకొండలు తదితరులు రేగాను కలిసిన వారిలో ఉన్నారు.


రేగాతో మణుగూరు నాయకులు


రేగాను కలిసిన బీఆర్‌ఎస్ దుమ్ముగూడెం కన్వీనర్, కో-కన్వీనర్లు

## ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో అదనపు కలెక్టర్ పూజలు

దుమ్ముగూడెం, జనవరి 1: మండల పరిధిలోని నర్సాపురంలో కొలువైన ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం(చిన్న అరుణాచలం)లో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ దంపతులు బుధవారం స్వామివారికి పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం కావడం ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు శివనాగస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న అదనపు కలెక్టర్ దంపతులు

## ఆర్యవైశ్య నిత్యాన్నదానానికి రూ.75వేలు వితరణ

భద్రాచలం, జనవరి 1: భద్రాచలం పట్టణంలోని ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రానికి అన్నదానం నిమిత్తం పాల్వంచకు చెందిన ప్రముఖ వ్యాపారి సంకా నాగేశ్వరరావు, వజ్రమ్మ దంపతుల కుమారులు, కోడలు, మనుమరాళ్లు సర్వేశ్వరరావు, రమా చిరంజీవులు, ప్రదీక్ష అద్వైత, ప్రదీప్త ఆరాధ్య రూ.75,116 వితరణగా అందజేశారు. వీటిని సత్రం ట్రస్టు బోర్డు సభ్యులు కంభంపాటి సురేష్‌కుమార్, వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ తాజా మాజీ అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో గుబ్బా పుల్లారావు, సత్రం మేనేజర్లు సత్యనారాయణ, చిరునోముల రామకృష్ణ పాల్గొన్నారు.

## వ్యసనాలకు బానిసలుగా మారొద్దు

అశ్వారావుపేట, జనవరి 1: వ్యసనాలకు యువత బానిసలుగా మారవద్దని, తమ బంగారు భవిష్యత్తును దెబ్బతీసుకోవద్దని సీపీఐ-ఎంఎల్ (మాస్‌లైన్) పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్ కోరారు. వ్యసనాలతో కలిగే నష్టంపై మండలంలోని కొత్త కావడిగుండ్ల గ్రామంలో యువతకు బుధవారం అవగాహన కల్పించారు. ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. జీవితం చాలా అందమైనదని, దానిని జాగ్రత్తగా కాపాడుకోవాలని అన్నారు. ముందుగా పీవైఎల్ జెండాను ఆవిష్కరించారు.

## పోలీసుల తనిఖీలు

టేకులపల్లి, జనవరి 1: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా టేకులపల్లిలో మంగళవారం రాత్రి సీఐ తాటిపాముల సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఎస్సై పోగుల సురేష్ పాల్గొన్నారు.

## హరిహర నామామృత లేఖలతో నగర సంకీర్తన

దుమ్ముగూడెం, జనవరి 1: మండల కేంద్రంలోని భద్రాచలం-పర్ణశాల వెళ్లే హైవే రోడ్డు పక్కన కొలువైన సంగమేశ్వరస్వామి శివాలయంలో హరిహర నామామృతం లేఖనం లిఖితం, నామామృత సంకీర్తన బుధవారం నిర్వహించారు. కంచి కామకోటి పీఠాధిపతులు ప్రవేశపెట్టిన హరిహర నామామృతలేఖను పట్టుకుని నామ సంకీర్తన చేస్తూ హరిహరాదులకు బేదంలేదని భక్తులకు తెలిపారు. వివిధ గ్రామాల భక్తులు ప్రధాన అర్చకులతో పాటు భక్తితో హరిహర నామామృత లేఖలను రాశారు.

## రోడ్డు భద్రత అందరి బాధ్యత : ఎంవీఐ

భద్రాచలం, జనవరి 1: రోడ్డు భద్రత ప్రతిఒక్కరి బాధ్యత అని భద్రాచలం ఎంవీఐ సంగెం వెంకటపుల్లయ్య అన్నారు. బుధవారం ఆర్టీసీ డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వేగ పరిమితి నిబంధనల ప్రకారం జరగాలని, మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మలుపుల వద్ద టర్న్ సిగ్నల్స్ పాటిస్తూ సురక్షితంగా వాహనాలు నడపాలన్నారు. డిపో మేనేజర్ తిరుపతి, ట్రాఫిక్ ఎస్సై మధు, డిపో డ్రైవర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంవీఐ వెంకటపుల్లయ్య

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చర్ల, జనవరి 1: మండలంలోని సత్యనారాయణపురం- ఆర్ కొత్తగూడెం మధ్య ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కలివేరు గ్రామానికి చెందిన కారం రామారావు బుధవారం ఉదయం ద్విచక్రవాహనంపై ఆర్ కొత్తగూడెం నుంచి కలివేరు వెళ్తున్నాడు. బట్టిగూడెం గ్రామానికి చెందిన సోడి జోగ ద్విచక్రవాహనంపై భద్రాచలం వైపు వెళ్తుండగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలు కాగా సత్యనారాయణపురం పీహెచ్‌సీకి తరలించారు. సోడి జోగ, కూరపాటి చరణ్ పరిస్థితి విషమంగా ఉండడంతో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## రాముడిని దర్శించుకున్న భక్తులు 23.74లక్షల మంది

భద్రాచలం, జనవరి 1: దక్షిణ భారతదేశంలో పుణ్యక్షేత్రంగా విలసిల్లుతున్న భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారిని 2024 సంవత్సరంలో 23,74, 215 మంది దర్శించుకున్నారని ఆలయ ఈవో రమాదేవి బుధవారం తెలిపారు. గత ఏడాది జనవరిలో 2,74,864, ఫిబ్రవరిలో 2,00,122, మార్చిలో 2,15,450, ఏప్రిల్‌లో 2, 27,884, మేలో 2,48,214, జూన్‌లో 2,03,210, జూలైలో 1,57,098, ఆగస్టులో 1,33,122, సెప్టెంబరులో 1,03,352, అక్టోబర్‌లో 1,45,333, నవంబర్‌లో 2,22,023, డిసెంబర్‌లో 2,43,543 మంది దర్శించుకోగా 2024లో మొత్తం 23,74,215 మంది స్వామి వారిని భక్తులు దర్శించుకున్నట్లు ఈవో తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

అశ్వారావుపేట, జనవరి 1: మండలంలోని గాండ్లగూడెం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గాండ్లగూడెం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి వాంకుడోతు నాగ చైతన్య(17), తన మిత్రుడు రుషేంద్ర కలిసి బైక్‌పై బుధవారం బచ్చువారిగూడెం బయలుదేరారు. ఇదే మార్గంలో, బచ్చువారిగూడెం నుంచి ఎదురుగా ద్విచక్ర వాహనదారుడు మద్యం మత్తులో వేగంగా వచ్చి, నాగచైతన్య, రుషేంద్ర ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో నాగ చైతన్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన మిత్రుడు రుషేంద్ర, మద్యం మత్తులో ఢీకొన్న దిచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు వెంటనే గుమ్మడవల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాగ చైతన్య మృతదేహాన్ని పోలీసులు పోస్ట్‌మార్టం కోసం అశ్వారావుపేట మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి సురేష్ ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఎస్సై యయాతి రాజు దర్యాప్తు చేస్తున్నారు.

## మతోన్మాద దాడులను ఖండించాలి

ఇల్లెందు రూరల్, జనవరి 1: మతోన్మాద దాడులను ఖండించాలని సీపీఐ-ఎంఎల్ (న్యూడెమోక్రసీ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు కోరారు. ఆయన బుధవారం ఇల్లెందులోని పార్టీ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బుక్ ఫెయిర్‌లో 'వీక్షణం' బుక్ స్టాల్ మీద ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదులు దాడికి దిగారని, 'వీక్షణం' పత్రిక ఎడిటర్ ఎస్.వేణుగోపాల్‌పై దౌర్జన్యం చేశారని చెప్పారు. దీనిని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని అన్నారు.

ఇల్లెందు, జనవరి1: హైదరాబాదులో 2024డిసెంబర్19నుంచి 29వరకు జరిగిన బుక్ ఫెయిర్‌లో వీక్షణం బుక్ స్టాల్ మీద,వీక్షణం పత్రిక ఎడిటర్ ఎస్.వేణుగోపాల్‌పై ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదులు దౌర్జన్యం చేయడాన్ని ఖండించిన సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు.బుధవారం ఇల్లెందు న్యూడెమోక్రసీ కార్యాలయంలో ముఖ్యనాయకులు సమావేశం ఎం.డి రాసుద్దిన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆవునూరి మధు మాట్లాడుతూ హిందుత్వ మతోన్మాద శక్తులు పెట్రేగిపోవడానికి ప్రధాని మోడీ,అమిత్‌షా అనుసరిస్తున్న కాషాయికరణ విధానలే కారణమని,దళితుడు అయినందున ఆయనపై దౌర్జన్యం చేసి మాలలో ఉన్న విద్యార్థుల కాళ్లు పట్టించిన మూర్ఖపుచేష్టలు ఇందులో భాగమన్నారు.


మాట్లాడుతున్న ఆవునూరి మధు

## స్కూల్ బస్ క్లీనర్ ఆత్మహత్య

అశ్వారావుపేట, జనవరి 1: ప్రైవేట్ స్కూల్ బస్ క్లీనర్‌గా పనిచేస్తున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల తెలిపిన వివరాలు.. మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన బొడ్డపాటి ఉపేంద్ర(25), ప్రైవేట్ స్కూల్ బస్ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. కుటుంబ సమస్యలు కూడా ఉన్నాయి. వీటి నేపథ్యంలో బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ యువకుడి తల్లి లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఎస్సై యయాతి రాజు దర్యాప్తు చేస్తున్నారు.